


# క్షీరసాగర మథనం

- నిర్మలాదిత్య

*(గత సంచిక తరువాయి)*

**షరీఫ్** వాళ్ళ కంపెనీ పద్ధతిలోనే ఇన్వాయిస్ చేస్తాను. హవాలా గురించి తరువాత మాట్లాడుకోవచ్చు అన్నాడు. దానితో బాటు పి.ఎల్. తో ,"ఇవ్వాళ మన స్కూల్ డే ఫంక్షన్ అండి. మీరే చీఫ్ గెస్ట్", అన్నాడు.

క్రోమ్ టానింగ్ కు మారిన తరువాత పని చేసే వారి సంఖ్య కూడా బాగా పెరిగింది. అప్పుడే పి.ఎల్.కు, ఓ బడి పెట్టాలనిపించింది. అలా కట్టడం వల్ల పని చేసే వాళ్లకు ఈ కంపెనీ మీద విశ్వాసం, అభిమానం ఎక్కువ అవ్వుతుందని పి.ఎల్. నమ్మకం. దానికి తోడు, ఆ బడి ఓ ట్రస్ట్ పేరున స్థాపిస్తే, టాక్స్ రాయితీలు ఉంటాయి అని మహేష్ చెప్పాడు. అందుకే ఓ బడి స్థాపించి, సి బి ఎస్ ఈ నుండి కూడా గుర్తింపు తెచ్చుకున్నాడు. ఆ చుట్టుపక్కల ఎక్కడా ఇలాంటి సి బి ఎస్ ఈ, ఇంగ్లీష్ మీడియం స్కూల్ లేనందు వల్ల బాగా పేరు తెచ్చుకుంది. ఈ బడిలో చేరడానికి వెయిట్ లిస్ట్ కూడా.

బడి చేరే సరికి బాగా జనం. ఎక్కువగా పిల్లలు వారి తల్లి తండ్రులు చేరారు. పి.ఎల్ భార్య కని చెల్వి బహుమతి ప్రధానానికి అప్పటికే వచ్చేసి, పి.ఏల్ కు ఎదురొచ్చింది. ప్రార్ధన, స్కూల్ రిపోర్ట్, పి.ఎల్. మిగితా అతిధుల భాషణా ల తరువాత బహుమతి ప్రధానాలు జరిగాయి.

పీర్ పిల్లలు సలీం, ఆయషాలు చాలా బహుమతులు అందుకోవడం పి.ఎల్. కు ఆనందం కలిగించింది. ఆయష ఆటలలోను, చదువులోను ముందంజ వేయడం ముచ్చటనిపించింది.

ప్రోగ్రాం తరువాత స్టేజి దిగి వెళ్తుంటే పీర్ ఫ్యామిలీ ఎదురొచ్చింది. పి.ఎల్., కని చెల్వి ఆయష, సలీం లను దగ్గర తీసుకొని, పీర్ ను, జుబేదాను అభినందించారు.

"పి.ఎల్. కంపెనీ సంగతేమో కానీ, ఈ బడి తెరచి ఓ గొప్ప పని చేసావు. ఇక్కడున్న వారికి పిల్లల చదువు గురించి బెంగ పోయింది", అన్నాడు పీర్.

పీర్ గొంతు లో పి.ఎల్. వ్యాపారం నడుపుతున్న తీరు గురించిన అసంతృప్తి జీరాలు, ఇంకా ఉన్నట్లు పి.ఎల్. కు వినిపించాయి. పి.ఎల్. నవ్వేసి, " ఆయష, సలీం నీ పేరు నిలబడుతున్నారు. అదృష్టవంతుడివి", పి.ఏల్. పీర్ ను అభినందించాడు.

"అరసు మళ్లీ ఎప్పుడొస్తున్నాడు, అంకుల్?", అడిగింది ఆయష.

అరసు ఊటీ లో బోర్డింగ్ స్కూల్ లో చేరిన తరువాత సలీం, ఆయష లు, అరసును బాగా మిస్ అయ్యారని తెలుస్తూనే ఉంది. కని చెల్వి పోరు పడలేక అరసును, ఏడుస్తున్నా, పట్టించుకోకుండా ఊటీలో చేర్పించి, మంచి పని చేసానా అని ఓ నిమిషం మనస్సు చివుక్కు మంది పి.ఎల్. కు.

కానీ వెంటనే, అరసు ను పంపించింది బెస్ట్ స్కూల్ కదా, వాడికి జీవితంలో అన్నీ బెస్ట్ దొరకకపోతే, నేను పడుతున్న ఈ శ్రమ కు అర్థం ఏమున్నది అనుకుని ఆలోచనలు ఆపి,

"బోర్డింగ్ స్కూల్ కదా ఆయష. ఎండ  కాలం సెలవులకే రావాలి. వాడు వచ్చిన వెంటనే మీ ఇంటికే వస్తాడు కదా. నేను కబురంపాల్సిన పని లేదు", నవ్వుతూ పీర్ కుటుంబం నుంచి వీడ్కోలు తీసుకున్నాడు పి.ఎల్.

పి.ఎల్ ను వద్దనుకొని, ఆ పి.ఎల్ బడిలోనే తన పిల్లలు చదవడం కొంచెం విచిత్రంగా అనిపించింది పీర్ కు. పి.ఎల్ చేస్తున్నది సరి కాదని వచ్చేసాడు, మరి బడి పెట్టడం లాంటి పనులు చేస్తే పి.ఎల్ ఫ్యాక్టరీలలో చేసే అవకతవకలు సరి అవ్వుతాయా? పి ఎల్ గ్రూప్ వారి నుండి కాక బయటి వారి నుండి స్కూల్ అడ్మిషన్ కు తీసుకొనే డొనేషన్ ల మాటేమిటి? కొన్ని ప్రశ్నలకు జవాబు కాలమే, అని తన ఆలోచనలకు ఫుల్ స్టాప్ పెట్ట గలిగాడు పీర్.

–7 –

సెయింట్ పీట్, ఫ్లోరిడా

జూన్, 2014

సోమవారం పొద్దున్నే ఉత్సాహంగా, ఆఫీసు కు బయకుదేరాడు విశ్వం. హైవే ఎక్సిట్ దగ్గిర మరో రోడ్డు వేయడం వల్ల, హైవే మీద రద్దీ తగ్గింది. ఓ అరగంటలోనే ఇంటి నుండి ఆఫీసుకు చేరుకోగలిగాడు.

ఇవ్వాళ పొద్దునే టౌన్ హాల్ మీటింగ్ ఉంది. అందువల్ల  బ్యాంక్ ఆవరణలో చేరిన జనాలతో, పోస్టర్లు, పేపర్లు బలూన్లతో ఓ తిరుణాల లాగా ఉంది.

పరిచితమైన ముఖాలకోసం వెదుకుతుంటే, రాబర్ట్ కనిపించాడు.

"హలో బాబ్. వాట్ ఏ సర్ప్రైజ్. ఎన్ని రోజులైంది నిన్ను చూసి", అన్నాడు విశ్వం. రాబర్ట్ ని బాబ్ అనే పిలుస్తారు అందరూ.

"హలో విశ్వం. నిన్ను కలుద్దామనే అనుకున్నాను. ఇదుగో ఈ టౌన్ హాల్ మీటింగ్ కి సి.ఈ.ఓ వస్తుంటే, నేను కూడా ఆయన ప్రైవేట్ జెట్లో వచ్చాను. ఈ టౌన్ హాల్ మీటింగ్ తరువాత మయామీ లోని హై నెట్ వర్త్ క్లయింట్ లను కొందరిని కలవాలి. అక్కడికి వెళ్ళాలి", అన్నాడు రాబర్ట్.

రాబర్ట్, విశ్వం ఒకే కాలేజీలో ఎం బి ఏ. చేసారు. కాదంటే క్యాంపస్ రిక్రూట్మెంట్ తరువాత రాబర్ట్ ప్రైవేట్ బ్యాంకింగ్ కి, విశ్వం ఇన్వెస్ట్మెంట్ బ్యాంక్ కి వెళ్లి పోయారు.

"గ్రేట్. కాఫీ తీసుకుందాం రా. ఇంకా టౌన్ హాల్ మీటింగ్ కి 10 నిమిషాలు ఉంది", అని పక్కనున్న కేఫ్టేరియాకి దారి తీసాడు, రాబర్ట్.

"ఎలా ఉంది నీ పని?", లాటే చేతిలో తీసుకొని అక్కడే ఉన్న ఓ హై టేబిల్ పక్కనున్న కుర్చీలో కూర్చుంటూ, అన్నాడు విశ్వం.

"నా సంగతేమిలే. అదే డిపార్ట్మెంట్ కదా. బాగానే ఉంది. కాదంటే ఓ మూడు ప్రమోషన్ లు వచ్చిన తరువాత, తిరగడం ఎక్కువైంది. ఈ మధ్య మన హై నెట్ వర్త్ కస్టమర్ ల ను కలవడం, వారి నుంచి మరింత బిజినెస్, బ్యాంక్ కు రాబెట్టడం నా పని. వీళ్ళు ఓ రకం లే? బ్యాంక్ తో వారి లావాదేవీలు మిలియన్ల డాలర్ల లోనే ఉంటుంది. ఎప్పుడూ వారి అడుగులకి మడుగులొత్తాలి. నీ పని ఎలా ఉంది?", అన్నాడు రాబర్ట్.

"నీకు తెలిసే ఉండాలి. ఇన్వెస్ట్మెంట్ బ్యాంక్ నుంచి, ఏ ఎం ఎల్ అదే ఆంటీ మనీ లాండరింగ్ డిపార్ట్మెంట్ కు మారాను. అన్నట్టు నీవు లాస్ వేగస్ వెళ్లే ఉంటావు. ఎప్పుడైనా బ్యాంక్ పని పైన వేగస్ పోయావ?", అని విశ్వం రాబర్ట్ ని అడిగాడు.

"వేగస్ వెళ్ళక పోవడమేమి. అక్కడున్న కేసినో హోటళ్ల లోనే మా క్లయింట్ మీటింగులు అడపా దడపా జరుగుతాయి" అన్నాడు రాబర్ట్

"పిరమిడ్ గ్రూప్ లో ఉన్న రెడ్ రాక్ కేసినోస్ కి వెళ్ళావ? స్పిన్క్స్ అదే సింహం దేహానికి మనిషి తల తగిలించి న ఈజిప్షియన్ పిరమిడ్ ఆకారంలో కట్టించారు. ఆ అకౌంట్ కూడా ప్రైవేట్ బ్యాంక్ కిందనే వస్తుంది కదా", అడిగాడు విశ్వం.

"అవును. ఎందుకడిగావు?", అనుమానస్పదంగా అడిగాడు రాబర్ట్.

"ఆ కంపెనీ గ్రూప్ నా డిపార్ట్మెంట్ లో పరిశీలనకు వచ్చింది. ఆ కంపెనీ గ్రూప్ లో ఉన్న కొన్ని కంపెనీల గురించి ప్రశలు వేస్తే, నేను కొత్త కాబట్టి ఇలాంటి అనుమానాలు వస్తున్నాయని, పిరమిడ్ గ్రూప్ కంపెనీలకి చాలా ఏళ్ల నుంచి మన బ్యాంక్ తో అనుబంధం ఉందని, నా పై వాళ్ళు కొట్టిపడేశారు. ఆ గ్రూప్ లో ఉన్న రెడ్ రాక్ కేసినో, పిరమిడ్ బిల్డర్స్ అండ్ డెవలపర్స్ లాంటి కంపెనీ ల బిజినెస్ అనుమానస్పదంగా ఉన్నాయి. నీ అభిప్రాయం ఏమిటి?", అని అడిగాడు విశ్వం.

రాబర్ట్ ఓ నిమిషం నిశ్శబ్దమై పోయాడు. ఎదో ఆలోచిస్తున్నాడని అర్ధం అవ్వుతూనే ఉంది.

"విశ్వం నువ్వడిగిన ప్రశ్నలు , నాకు మొదట్లో వచ్చిన అనుమానాన్ని, తిరిగి గుర్తుకు తెప్పించింది. ఆ అకౌంట్ ఫారాలలో, చాలా క్యాష్ ట్రాన్సక్షన్స్ ఉంటాయని ఆ కంపనీలు రాసాయి", అన్నాడు రాబర్ట్.

"అందులో ఆశ్చర్యం ఏమి ఉంది. కాసినో కంపెనీ లన్నిటికి క్యాష్ ట్రాన్సక్షన్స్ ఉంటాయి కదా", అన్నాడు విశ్వం.

"నిజమే. కానీ ఈ కంపనీ అదే కంపనీ సైజ్ ఉన్న కంపెనీలతో పోలిస్తే మూడింతలు ఎక్కువ క్యాష్ ట్రాన్సక్షన్స్ ప్రొజెక్ట్ చేసింది. అకౌంట్ తెరిచిన తరువాత, ఇంకా ఎక్కువ క్యాష్ లావా దేవీలు జరుగుతున్నాయని తెలిసింది. నేను ఈ విషయం ఓ మీటింగ్ లో లేవదీస్తే, ఇది పెద్ద కేసినో అని నా నోరు మూయించారు. ప్రైవేట్ బ్యాంక్ కస్టమర్ లలో, పిరమిడ్ గ్రూప్ పెద్ద క్లయింట్. ఆ అకౌంట్ జాగ్రత్త. మీటింగ్ మొదలు పెడుతున్నారు. పోదామ", అంటూ లేచాడు రాబర్ట్.

మీటింగ్ తరువాత విశ్వం, పిరమిడ్ అకౌంట్లు వదిలి మిగిలిన వాటిని పరిశీలించి, నోట్స్ రాసి పైకి పంపించాడు. రేపొద్దున రావటంలేదని బెత్ కు మెయిల్ పంపించాడు. బెత్ నసుగుతూనే సరి అంది. నెక్స్ట్ టైం ఓ వారం రోజుల ముందే, ఇలాంటి పెర్మిషన్ తీసుకోవాలి అని మందలించింది. ఓ సారి బెత్ కు తన ఆరోగ్య సమస్య గురించి చెప్పేద్దామని పిస్తుంది. కానీ బెత్ ఎలా తీసుకుంటుందో తెలియదు. మొదలే ప్రతీ సంవత్సరం కొంతమందిని ఉద్యోగాల నుంచి తీసేస్తున్నారు. తెలిసి కొరివితో తల గోక్కోవడం ఎందుకులే అని, చెప్పగూడదని నిర్ణయం తీసుకున్నాడు విశ్వం.

విశ్వం కాన్సర్ సెంటర్ కి పోవడం అదే మొదటి సాటి. రాష్ట్రం కంతటికి పేరు పొందినది ఆ సెంటర్. పెద్ద బిల్డింగ్లతో, వచ్చే పోయే జనాలు, కార్లతో ఆ సెంటర్ ఓ పక్క భయం, మరో పక్క కాన్సర్ పోగొట్టేస్తుంది అన్న ఆశ ఒకే సారి కలుగ జేసింది విశ్వం కు. గేట్ దగ్గిరే కుర్రాళ్లు, కారులోనుంచి పేషెంట్లు దిగడానికి సహాయపడి, కారు కీస్

తీసుకొని వేలే పార్క్ చేస్తున్నారు. ఇదేదో బాగానే ఉందని, విశ్వం కుర్రాడు ఇచ్చిన వేలే పార్కింగ్ టికెట్ సీత కిచ్చి సెంటర్ లోపలికి దారి తీశాడు.

బయాప్సీ అప్పాయింట్మెంట్ కాబట్టి వెంటనే పిలిచారు. సీతను వెయిటింగ్ రూమ్ లో ఉంచి, లోపలికి పోయాడు విశ్వం. డిపార్ట్మెంట్ హెడ్ అది వరకే విశ్వం మిత్రుడు డాక్టర్ వెంకటేసులు మాట్లాడినందువల్ల పరిచితుడు లాగానే పలకరించి తాను బయాప్సీ కి చేయబోయే ప్రొసీజర్ వివరించాడు. ఓ పది నిమిషాల్లో వస్తానని, అక్కడే ఉన్న నర్స్ ప్రాక్టీషనర్ కు అప్పగించి బయటకు వెళ్ళాడు. బట్టలు విప్పి నర్స్ ఇచ్చిన గౌన్ వేసుకొని ఒంటరిగా ఆ రూంలో వేచి ఉన్నాడు విశ్వం. బయాప్సీ చేయడానికి అన్ని వసతులు ఈ రూంలో నే ఉన్నాయని పించింది, విశ్వం కు. అక్కడే బెడ్ ఉంది. ఇమేజింగ్ స్క్రీన్ లు, వాటికి అంటుకొని ఉన్న పరికరాలు కనిపిస్తున్నాయి. ప్రోస్టేట్ నుంచి బయాప్సీ కింద స్పెసిమెన్లు సేకరించాలంటే పెద్ద పేగు ద్వారా మార్గం. కోలోనిస్కోపీ లాగానే. కాదంటే ఈ ప్రొసీజర్ కి మత్తు మందు ఇచ్చి నిద్ర పుచ్చ నవసరం లేదు.

ఓ పది నిమిషాల తరువాత నర్స్, డాక్టర్ ఇద్దరు వచ్చారు. విశ్వం ను సైడ్ లో పడుకోమని, ప్రోబ్ ఇన్సర్ట్ చేసి, ప్రోస్టేట్ దగ్గర ఉంది అని నిర్ధారణ చేసుకొని, స్పెసిమెన్లు తీసుకోవడం మొదలెట్టారు. దీపావళిలో కాప్ బిల్లలు కాల్చినట్లు టప్, టప్ అని మంద్రంగా శబ్దాలు. ఓ రెండు నిమిషాలలో ముగిసిపోయింది. ప్రోబ్ తీసేసి, ఆ రోజు యూరిన్ లో రక్త ఛాయలు కనిపిస్తే అది సహజమేనని, భయ పడ నవసరం లేదని, పోయే ముందు ఓ ఇంట్రావెనస్ ఇంజక్షన్ వేసుకోమని వేరే వార్డు కు పంపించారు. బయట సీత ఆతృతతో ఎదురొచ్చింది. అంతా బాగానే అయ్యింది అని సీతతో చెప్పి, ఇంజక్షన్ కోసం ఆరో అంతస్తులో ఉన్న వార్డ్ కి వెళ్లారు.

అది కీమో వార్డ్. ఎందుకు ఈ అంటిబయాటిక్ ఇంజక్షన్ ఈ వార్డులో వేస్తున్నారో అర్ధ కాలేదు విశ్వం, సీత ఇద్దరికి. పైగా వెయిటింగ్. రెండు గంటల తరువాత వార్డు లోపలకి పిలిచారు. అక్కడ వరుసలు, వరసులుగా కీమో తీసుకుంటున్న వారు చేతులు చాచుకొని కూర్చొని ఉన్నారు. పైన వేలాడు తున్న ప్లాస్టిక్ సంచుల నుండి, మందు వారి రక్త నాళాల ద్వారా క్యాన్సర్ ను రూపు మాపడానికి ప్రవహిస్తూ ఉంది. అందరి ముఖాలలో ఓ నిర్లిప్తత తో కూడిన ఆశా కిరణాలు కనిపించాయి విశ్వంకు.

–8 –

1989. నెగోషియబుల్ ఇన్స్ట్రుమెంట్స్ చట్టం 1881 – సెక్షన్ 138 సవరణ – తమ బ్యాంకు అకౌంట్లలో బాలన్స్ లేనందువల్ల చెక్ వాపసు అయ్యితే, వారికి చెక్ విలువకు రెండింతలవరకు పెనాల్టీ లేక రెండు సంవత్సరాల ఖైదు లేక రెండు వర్తించే శిక్ష.

వినోద్ బ్యాంకు బ్రాంచ్ చేరి ఆఫీసులో అందరు స్టాఫ్ వచ్చారా లేదా చూసుకొని, అన్ని కౌంటర్లలలో ఒకో ఉద్యోగి ఉన్నాడు అని తెలిసిన తరువాత, కొంత నెమ్మదించాడు. బ్రాంచ్ మేనేజర్ అయ్యితే ఇదో టెన్షన్. క్లర్క్స్ , క్యాషియర్స్ ఓ ఇద్దరు రాలేదంటే, ఉండేవాళ్ళనే బ్రతిమాలుకొని పని చేయించాలి. వాళ్లని దబాయించడానికి కూడా వీల్లేదు. పెద్ద యూనియన్ గొడవై కూర్చుంటుంది. తన కింద ఓ ఇద్దరు ఆఫీసర్లు ఉన్నారు. వాళ్ళు రాకుంటే, ఆ పని తనదే. ఇక ఆరోజు తన పని గానుగ లో వేసిన చెఱుకే.

అందరు స్టాఫ్ ఆరోజు రావడంతో , అకౌంటెంట్ ని బ్రాంచ్ చూసుకో మని , వినోద్ తన యేజ్డి మోటార్ బైకు తీసులోని ఇన్స్పెక్షన్ కి బయలు దేరాడు. తమ బ్యాంకు బ్రాంచ్ పరిశ్రమల కనే కేటాయించిన ఎస్టేట్ లో కట్టడం వల్ల, చుట్టూ పరిశ్రమలే. అందులో చాల పరిశ్రమలు తమ బ్యాంకు నుండి అప్పు తీసుకొన్నవే. వాటిని నెలకొక సారైనా బ్యాంకు అధికారులు తనిఖీ చేయాలి. పరిశ్రమ అప్పు తీసుకున్నప్పుడు ఇచ్చిన అంచనాల మేరకు పని చేస్తున్నదా లేదా అన్నది ఈ ఇన్స్పెక్షన్ ల ముఖ్యోద్దేశ్యం. ప్రతీ సారీ ఇలా తనిఖీ చేసినప్పుడు, ఎదో ఒక ఆశ్చర్యం గొలిపే విషయం బయట పడుతుంది. ఎక్కువగా అవి బ్యాంకు కు , వినోద్ కు మరింత ఆదుర్ద కలిగించే విషయమే అయ్యి ఉంటుంది.

వినోద్ ముందు హిమాలయ సిలిండెర్స్ ప్రై లిమిటెడ్ కంపెనీకి వెళ్ళాడు. తమ బ్రాంచ్ కున్న మంచి అకౌంట్లలో ఇదొకటి. జపాన్ కంపెనీ తో ఒప్పొందం కుదుర్చుకొని వారి సాయం తో తీర్చి దిద్దిన కంపెని . హై ప్రెషర్ కు తట్టుకొనే స్టీల్ ట్యూబ్స్ దిగుమతి చేసుకొని, వాటిని తగిన సైజు కు కట్ చేసి, ఎక్కువ వేడి ఉన్న గ్యాస్ కట్టర్స్ తో ఒక వైపు గొట్టం మూసి మరో వైపు గ్యాస్ నింపడానికి గొంతులా సాగతీసి తయారు చేస్తారు. అన్నీ మెషీన్ల పైనే. ఎక్కువ పని వాళ్ళ అవసరం లేదు. ఇలా తయారు అయ్యిన సిలిండర్లను అందులో నింపే గ్యాసులను బట్టి రంగు కొట్టి, ఆరిన తరువాత లేబుల్ చేసి అమ్మకానికి లారీలలో బయటికి పంపించేస్తారు. వినోద్ కు ఈ కంపెనీ తనిఖీ చేయడం ఇష్టమే. కంపెనీ బాగా మేనేజ్ చేయడం వాళ్ళ పెద్ద సమస్యలు లేవు. ఇంపోర్ట్ చేసుకొన్న ట్యూబుల లెక్కలు సరిపోతాయి. ఫ్యాక్టరీ ఎప్పుడు పని చేస్తూనే ఉంటుంది. అకౌంటెంట్ దగ్గర పోయి బిల్స్ చూస్తే అన్ని లెక్కలు సరి గా ఉంటాయి. వినోద్ ఈ సారి కూడా తన ఇన్స్పెక్షన్ తొందరగానే ముగించేశాడు.

తరువాత తనిఖీ చేసిన మరో రెండు పరిశ్రమలలో ఒక దానిలో ముడి సరుకు ఏ మాత్రం కదలటం లేదు. ఓనర్ తొందరలోనే ఒక పెద్ద ఆర్డర్ రాబోతున్నదని , అది వచ్చిన వెంటనే ఈ సమస్య ఉండదని వినోద్ కు చెప్పాడు. ఒక ఆర్డర్ మీదే ఆధార పడడం పెద్ద రిస్క్ అని, మరిన్ని చోట్ల అమ్మడానికి ప్రయత్నించమని చెప్పి మరో పరిశ్రమ కు తన బైక్ నడిపాడు.

దారిలో ఒక చిన్న షెడ్డు వినోద్ ను ఆకర్షించింది. ఎప్పుడు మూత బడి ఉండేది, ఈ రోజు తెరిచి ఉంది. వినోద్ ఆశ్చర్యంతో బ్రేక్ వేసి తన బైకు ఆ షెడ్ వైపు తిప్పాడు. ప్రభుత్వ పథకం కింద ఓ కుర్రాడికి ఇచ్చిన చిరు లోన్ అది. తను ఇది వరకే ఆ అకౌంట్ ఫైల్ చదివాడు కాబట్టి, అన్ని విషయాలు తెలుసు. షెడ్ లోపల ఓ రెండు రూములు ఉన్న బిల్డింగ్ ఉంది. ముందు రూమ్ ఆఫీసు లాగ ఉంది. ఆ రూంలో ఏమి లేదు . రెండో రూంలో ఒక చిన్న మెషిన్ ఉంది. దాని చుట్టూ రాగి వైర్లు, ఎరుపు, నీలం ప్లాస్టిక్ ముక్కలు, ముద్దలు ముద్దాలుగా పడి  ఉన్నాయి. వాటిని చూస్తూ, ఎదో లోకంలో విచారంగా విహరిస్తున్న, ఓ గడ్డం మాసిన యువకుడు కనిపించాడు వినోద్ కు. వినోద్ హలో అనగానే ఉల్లిక్కి పడి , ఇహ లోకానికి వచ్చి వినోద్ వైపు తిరిగి చూసాడు.

“నీ పేరు దివాకర్ కదూ”, అడిగాడు వినోద్

“ అవును. మీకెలా తెలుసు”, అడిగాడు ఆ యువకుడు.

“నేను నువ్వు అప్పు తీసుకున్న బ్యాంకు మేనేజర్ ని. ఇన్స్పెక్షన్ కి వచ్చాను. ఏమి జరుగుతున్నది? గత మూడు నెలలుగా చూస్తున్నాను ఇది మూత పడే ఉంది. ఫ్యాక్టరీ నడపడం లేదా ? ఆ ప్లాస్టిక్ ముద్దలేమిటి? నీ అకౌంట్ పుస్తకాలు ఎక్కడ? “ , వినోద్ ప్రశ్నలు వేయడం మొదలెట్టాడు.

దివాకర్ నిచ్చేష్టుడయ్యాడు . ఎదో భయం, ఆందోళనలు ఆ ముఖంలో తచ్చాడడం వినోద్ గమనించాడు. ఇంకో ప్రశ్న వేస్తే బోరు మని ఏడ్చేటట్లు ఉన్నాడు. వినోద్ దగ్గరికి వెళ్లి భుజం నొక్కి,

“నేను నీకు సహాయం చేయడానికే వచ్చాను. ఏమి జరుగుతున్నదో ముందు నాకు చెప్పు. ప్రతీ సమస్యకు ఒక పరిష్కారం ఉంటుంది’’ అన్నాడు

“పొరబాటు చేసాను సార్. ఇక్కడే ఓ ఆస్బెస్టాస్ కంపెనీలో పని చేస్తుండే వాన్ని . హై స్కూల్ పాస్ అయ్యిన వారికి ఓ పరిశ్రమలో  ట్రైనింగ్  ఇచ్చి, స్వయం ఉపాధి కలిగిస్తానంటే నా ఉద్యోగం మానేసి ట్రైనింగ్ లో చేరాను. ఎలక్ట్రిక్ వైర్ లు చేయడం మీద  ట్రైనింగ్ ఇచ్చారు. తరువాత ఏవో పేపర్ల మీద సంతకం పెట్టమని ఈ షెడ్ , ఈ మెషీన్, కొన్ని రాగి వైర్లు, ప్లాస్టిక్ ముద్దలు ముడి సరుకు గా ఇచ్చారు. నేను ట్రైనింగ్ లో చెప్పినట్లు చేసా . అయినా ఈ తయారు అయ్యిన వైర్లు చూడండి రాగి వైర్ చుట్టూ అక్కడక్కడ ముద్దలు వచ్చాయి. కొన్ని చోట్ల  రాగి వైర్ కి అసలు ప్లాస్టిక్ అంటుకోలేదు. ఎవరు కొంటారీ వైర్లు. అందుకే దీన్ని మూసివేసి మళ్లీ ఆస్బెస్టాస్ కంపెనీలో పాత పనిలో చేరాను’’, అన్నాడు దివాకర్.

వినోద్ కు దివాకర్  ప్రభుత్వం  నిర్వహించిన చిరు పరిశ్రమ లోన్ మేళా లో బలి పశువు అని తెలిసి పోయింది.

"దివాకర్ నువ్వు ట్రైనింగ్ తీసుకున్నావు కదా, ఎలా జరిగింది ఇది?", అని అడిగాడు.

"సార్ ట్రైనింగ్ లో ఓ పది మంది ఉన్నాం. మా అందరికి

ఒకతను ఎలా చేయాలో చూపెట్టాడు", అన్నాడు దివాకర్

"అంటే నీ అంతటికి నువ్వు ఓ సారి కూడా మెషిన్ మీద పనిచేయలేదా ?", ఆశ్చర్యంతో అడిగాడు వినోద్.

"లేదు సార్. ట్రైనింగ్ ఒక రోజే. అందులోను మాకు ఇచ్చే ట్రైనింగ్ ఆరంభించడానికి, చూడడానికి ఇక్కడి ఎం ఎల్ ఏ , మినిష్టర్ వచ్చారు. అంత టైం కూడా దొరకలేదు", అన్నాడు దివాకర్.

వినోద్ ఆలోచించాడు. పక్క ఊర్లో ఉన్న బ్రాంచ్ లో ఇలాంటి ఎలక్ట్రిక్ వైర్ ల ఫ్యాక్టరీకి అప్పు ఇచ్చారని తనకు తెలుసు. ఆ బ్రాంచ్ మేనేజర్ తో మాట్లాడి దివాకర్ కు ట్రైనింగ్ అవకాశం ఇప్పిస్తే, మళ్ళీ ఈ ఫ్యాక్టరీ నడపచ్చు అనిపించింది. ఆ మాటే చెప్పాడు వినోద్.

"మళ్ళీ ట్రైనింగ్ ఎట్లా సార్? ఆస్బెస్టాస్ కంపెనీ లో పని చేయక పోతే, నాకు జీతం ఎట్లా? ఉన్న డబ్బు అంతా ఇప్పటికే ఈ ప్లాస్టిక్ ముద్దలతో పోయింది ", అని వాపోయాడు దివాకర్.

"రేపు బ్రాంచ్ కు రా. నేను నీకు ఈ నెల సరిపడే డబ్బు అప్పు ఇస్తా. అంతలోనే నేను నీ ట్రైనింగ్ కూడా మాట్లాడి పెట్టి ఉంటా. ట్రైనింగ్ అయ్యిన తరువాత నువ్వు ప్లాస్టిక్ వైర్ లు ఖచ్చితంగా తయారు చేయగలవు. బ్యాంకు అప్పు కూడా తీర్చగలవు ", అని ధైర్యం చెప్పాడు వినోద్.

ఇక ఈ రోజుకి చాలు అని తిరిగి బ్రాంచ్ కు వెళ్తుంటే, పి .ఎల్ వాళ్ళ ఫ్యాక్టీరీ కనిపించింది. వాళ్ళకి కష్టాలలో ఉన్నప్పుడు దారి చూపింది తనే . కాని ఓ రెండు ఏళ్ళలోనే అకౌంట్లు చెన్నై కి మార్పించుకున్నారు. బ్యాంకు రూల్స్ పాటించి బ్యాంకులు ఇచ్చిన లిమిట్ లలోనే డబ్బులు తీసుకోవాలి అని తాను చెప్పేవాడు. లిమిట్ పైన పోయి కూడా డబ్బులు పాస్ చేయమని పి .ఎల్ వాళ్ళ గొడవ. రీజినల్ మేనేజర్ పాస్ చేయమని తనకింద వారితో చెప్పిస్తాడు కాని, నోటి తో కానీ, రాత తో కానీ, కమిట్ అవ్వడు . చివరకు రీజినల్ మేనేజర్ తో కుమ్మక్కై వీలైనప్పుడల్లా డబ్బులు నొక్కేసే బ్రాంచ్ మేనేజర్ ఒకడు చెన్నై లో ఉంటె, ఆ బ్రాంచ్ కి అకౌంట్లు మార్పించుకున్నారు పి.ఎల్ కంపెనీ వాళ్ళు. ఆ బ్రాంచ్ ఎగుమతి, విదేశీ మారక లావాదేవీలు కూడా చేయడం, మరింత సౌకర్యం అయ్యింది పి.ఎల్ కంపనీ కి.

మరుసటి రోజు 11 గంటలకు వినోద్ క్లియరింగ్ కని వచ్చిన చెక్కులు చూస్తున్నాడు. 12 గంటలకంతా, చెక్స్ చూసి, తగిన బాలన్స్ లేకపోయినా, చెక్ లలో ఏదైనా పొరబాట్లు ఉన్న చూసి వాపసు చేయాలి. 12 కంతా వాపసు చేయకపోతే, ఆ చెక్ పాస్ అయ్యిందని అవతలి బ్యాంకు వాళ్లకు , ఆ చెక్ అకౌంట్లో వేసినవారికి డబ్బు అంద జేస్తారు.

ఎల్లోరా ఫార్మా వాళ్ళ చెక్ వచ్చింది. అప్పటికే వాళ్ల అకౌంట్ లో లిమిట్ కంటే ఎక్కువ డబ్బు అప్పు చూపెడుతున్నది. ఎల్లోరా ఫార్మ ఓనర్ రూమ్ బయట తచ్చాడుతున్నాడు. వినోద్ చూసి పిలిపించాడు.

చెక్ గురించేనా? మీ లిమిట్ 5 లక్షలు. ఇప్పటికే అప్పు ఐదున్నర లక్షలు ఉంది. ఓ పది శాతం వరకు, మీకు బిల్లులు వస్తాయి అంటే, నేనే పాస్ చేసాను. మీ బిల్ పేమెంట్స్ ఇంకా రాలేదు. ఈ పది వేల చెక్ రిటర్న్ చేస్తున్నాను", అన్నాడు వినోద్.

"చెక్ పాస్ చేయమని చెప్పడానికే వచ్చాను. రీజినల్ మేనేజర్ తో మాట్లాడాను. మీరు ఫోన్ చేసి కనుక్కోండి", అన్నాడు ఓనర్ కొంచెం అధికారంగానే.

"నేను ఆయనకు ఫోన్ చేయనవరం లేదు. మీకు ఇలా లిమిట్ పైన పాస్ చేయాలని అర్జీ పెట్టుకోండి. నేను రీజినల్ మేనేజర్ కి అప్రూవ్ చేయమని పంపిస్తాను . ఆయన దగ్గరి నుండి ఆ లెటర్ వచ్చిన వెంటనే మీ చెక్కులు పాస్ చేయిస్తాను" అన్నాడు  వినోద్.

ఆ ఓనర్ రీజినల్ మేనేజర్ కు బాగా తెలిసిన వ్యక్తి అని వినోద్ కు తెలుసు. అదేమీ ఖర్మనో ఈ మేనేజిమెంట్ చైనులో, ఇప్పుడే చేరిన తాను తప్పితే, అందరూ ఇలాంటి ఓనర్లకు ఆప్తులే. అందుకే తరచూ తనతో గొడవలు వస్తున్నాయి, పేరు పోయింది. ప్రమోషన్ కూడా రావటం లేదు.

వినోద్ మాటలకు ఎల్లోరా ఫార్మా ఓనర్ కు కోపం వచ్చింది. తన దగ్గర ఉన్న తాళ చెవుల గుత్తి వినోద్ టేబిల్ పై విసిరి , మీరు ఆ చెక్ పాస్ చేయకపోతే మాకు కావలసిన ముడి సరుకు రాదు. ప్యాక్టరీ మూత పడాల్సి వస్తుంది. మీరే నడుపుకోండి ", అన్నాడు

వినోద్ కూడా కోపం వచ్చింది. ఇదేంటి ఇలాగా ప్రవర్తిస్తున్నాడు. కానీ ఓపిక తెచ్చుకొని, తన కోపం కప్పి పుచ్చు కొని సౌమ్యంగానే "మీరు తాళం చెవులు అలా విసిరేయడం బాగాలేదు. మీరు ఇక్కడే విడిచేసి వెళ్తే మేము మీరు మళ్ళీ వచ్చి తీసులోనే వరకు, తాళం చెవుల గుత్తి,  మా సేఫ్ లోనే పెడతాం. కానీ ఈ గుత్తిలో, మీ కార్ కీస్ కూడా ఉన్నట్టున్నాయి. మీరు నడిచి వెళ్లాల్సి వస్తుందేమో. మీ ఫ్యాక్టరీ నడపడం మా పని కాదు. మీకు చెక్ పాస్ కావాలంటే మీరే

రిజినల్ మేనేజర్ దగ్గరకి వెళ్ళి ఓ లెటర్ నాకు పంపమనండి. మరీ అర్జెంట్ అంటే మీ చేతితోనే పట్టుకొని తెండి.”, అని చెప్పాడు వినోద్.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

Post your comments